సాక్షి
విశాఖపట్నం
బుధవారం । 17 । ఏప్రిల్ । 2024

భజరే.. శ్రీ రామమ్

విద్యుత్ వెలుగుల్లో జగదాంబ సమీపంలోని అంబికాబాగ్ రామాలయం

13లో





సింహగిరిపై వేడుకలకు శారదా పీఠాధిపతికి ఆహ్వానం 8లో

# రేపే విడుదల



- 18న ఎన్నికల నోటిఫికేషన్ జారీ, నామినేషన్ల స్వీకరణ
- విస్తృత ఏర్పాట్లు చేసిన అధికారులు
- కలెక్టర్, ఆర్వో కార్యాలయాల్లో నామినేషన్ పత్రాలు సిద్ధం
- 14,335 మంది సిబ్బందికి ఎన్నికల నిర్వహణపై శిక్షణ
- నేటి నుంచి మరింత పక్కాగా ప్రచార పర్యవేక్షణ



**సాక్షి, విశాఖపట్నం:** మరో 24 గంటల్లో సార్వత్రిక సమరానికి కీలక అడుగు పడనుంది. నోటిఫికేషన్ విడుదలతోపాటు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ కూడా గురువారం ప్రారంభం కానుండటంతో జిల్లా యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేసింది. విశాఖ పార్లమెంట్ స్థానంతో పాటు ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు అభ్యర్థుల నుంచి ఈ నెల 25వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరించనున్నారు. పార్లమెంట్ నియోజకవర్గానికి జిల్లా కలెక్టరేట్‌లో ఆర్వో, కలెక్టర్ మల్లికార్జున నామినేషన్లు స్వీకరిస్తారు. విశాఖ తూర్పుకు సంబంధించి జాయింట్ కలెక్టర్ కార్యాలయం, దక్షిణకు సంబంధించి టర్నర్ చౌల్ట్రీ ఆవరణలోని మహారాణిపేట తహసీల్దార్ కార్యాలయం, ఉత్తరకు సీతమ్మధార తహసీల్దార్ కార్యాలయం, పశ్చిమకు జ్ఞానాపురంలోని జీవీఎంసీ జోన్-5 కార్యాలయం, భీమిలికి భీమిలి ఆర్డీవో కార్యాలయం, పెందుర్తికి పెందుర్తి తహసీల్దార్ కార్యాలయం, గాజువాకకు సంబంధించి జెడ్పీ కార్యాలయాలను సిద్ధం చేశారు. ఇప్పటికే నామినేషన్ పత్రాలను ఆర్వో కార్యాలయాలకు పంపించారు. ఎన్నికల నిర్వహణ కోసం 14,335 మందిని వినియోగిస్తున్నారు.

**పక్కాగా ఎన్నికల కోడ్**

ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ఇప్పటి వరకు ఆయా పార్టీల అభ్యర్థులు ప్రచారం చేస్తున్న ఖర్చులు పార్టీల ఖాతాల్లోకి వెళ్తున్నాయి. నోటిఫికేషన్ వెలువడినప్పటి నుంచి ప్రచారానికి సంబంధించిన ప్రతీ ఖర్చు అభ్యర్థుల ఖాతాలో గణిస్తారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి మరింత పక్కాగా అమలు చేయనున్నారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్(ఎంసీసీ)ని పరిశీలించి నివేదికలు అందించేందుకు 18 బృందాలు ఏర్పాటు చేశారు. వీటితో పాటు 23 ఫ్లైయింగ్ స్క్వాడ్స్, 18 వీడియో సర్వైలెన్స్ టీమ్‌లను సిద్ధం చేశారు. ఎన్నికల కమిషన్ నుంచి వచ్చిన ఎన్నికల ఖర్చుల పరిశీలకులను అదనంగా నియోజకవర్గానికి ఒకరు చొప్పున నియమించారు.

## నోటిఫికేషన్ షెడ్యూల్ ఇలా..

| | |
|---|---|
| నోటిఫికేషన్ విడుదల | ఈ నెల 18వ తేదీ |
| నామినేషన్లు ప్రారంభం | గురువారం నుంచి |
| సమయం | ప్రతి రోజూ ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు |
| నామినేషన్లకు తుది గడువు | ఈ నెల 25 మధ్యాహ్నం 3 గంటల వరకు |
| నామినేషన్ల పరిశీలన | ఈ నెల 26వ తేదీ |
| ఉపసంహరణకు తుది గడువు | 29వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు |

## నామినేషన్లకు ఇవీ అర్హతలు

- **భారతదేశ పౌరుడై ఉండాలి. నామినేషన్ దాఖలు చేసే రోజుకు 25 ఏళ్ల పూర్తయి ఉండాలి.**
- **రాష్ట్రంలో ఏదైనా ఓ నియోజకవర్గంలో ఓటరుగా నమోదై ఉండాలి.**
- పోటీ చేసే వారికి ఒకరు లేదా ఇద్దరు బలపరచాల్సి ఉంటుంది. గుర్తింపు లేని పార్టీ అభ్యర్థులు, స్వతంత్రులకైతే 10 మంది ఓటర్లు బలపరచాలి. అలా బలపరిచే వారు అదే నియోజకవర్గానికి చెందిన ఓటర్లుగా ఉండాలి.
- ఎమ్మెల్యే అభ్యర్థులు సాధారణ కేటగిరీ వారు రూ.10 వేలు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.5 వేలు ధరావత్తు చెల్లించాలి.
- నామినేషన్ దాఖలు చేయడానికి 48 గంటల ముందు అభ్యర్థులు తప్పనిసరిగా తమ పేరిట ఏదైనా గుర్తింపు పొందిన బ్యాంకులో ఖాతా తెరవాలి. ఆ ఖాతా ద్వారానే తన ఎన్నికలకు సంబంధించిన లావాదేవీలు నిర్వహించాలి. బ్యాంక్ అకౌంట్ పుస్తకం ప్రతిని ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అందజేయాలి.
- **ఫారం-2బిలో నామినేషన్ పత్రం దాఖలు చేయాల్సి ఉంటుంది.**
- **నామినేషన్ దాఖలుచేసే సమయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారికి నోటరీతో కూడిన అఫిడవిట్ సమర్పించాలి. అందులో అభ్యర్థి, అతని కుటుంబ సభ్యుల స్థిర, చరాస్తుల వివరాలు** చూపించాలి. పోలీసు కేసులు ఉంటే వాటి వివరాలు, క్రైం నంబర్‌తో సహా పొందుపర్చాలి.
- అఫిడవిట్‌లోని అన్ని ఖాళీలను తప్పనిసరిగా పూరించి సమగ్ర వివరాలను నమోదు చేయాలి.
- ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే ప్రభుత్వ ఉద్యోగి తన ఉద్యోగానికి రాజీనామా చేయాలి. రాజీనామాను ఆమోదించినట్లుగా ప్రభుత్వం జారీ చేసిన ధ్రువీకరణ పత్రాన్ని నామినేషన్‌తో పాటుగా దాఖలు చేయాలి.
- అభ్యర్థులు ఇంటి, నీటి పన్ను, విద్యుత్ ఛార్జీ బిల్లు బకాయిలు లేనట్లుగా ధ్రువీకరణ పత్రాలు అందజేయాల్సి ఉంటుంది.

## ఆన్‌లైన్‌లోనూ నామినేషన్లు



జిల్లా పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు, ఓ పార్లమెంట్ స్థానానికి గురువారం నోటిఫికేషన్ వెలువడనుంది. దీనికి సంబంధించిన అన్ని ఏర్పాట్లను ఆయా నియోజకవర్గాల పరిధిలోని అధికారులు పూర్తి చేశారు. అన్ని నియోజకవర్గాల్లోని రిటర్నింగ్ అధికారులు(ఆర్) ఫారం -1 ద్వారా నామినేషన్ల స్వీకరణకు నోటిఫికేషన్ వెలువరిస్తారు. సెలవు రోజుల్లో నామినేషన్లు వేసేందుకు వీలులేదు. సువిధ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లోనూ నామినేషన్ల స్వీకరించేందుకు ఎన్నికల సంఘం సదుపాయం కల్పించింది. అయితే ఆన్‌లైన్‌లో నమోదు చేసినా.. భౌతికంగా సంతకం చేసిన పత్రాలను అందజేయాల్సి ఉంటుంది. నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానున్న నేపథ్యంలో పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేశాం. ఆర్వో కార్యాలయానికి 100 మీటర్ల పరిధి వరకు 144 సెక్షన్ అమల్లో ఉంటుంది. ఆర్వో కార్యాలయంలో వీడియో బృందాలతో పాటు 360 డిగ్రీల్లో పని చేసే సీసీ కెమెరాలు కూడా ఉంటాయి. నామినేషన్ దాఖలు సందర్భంగా ఆర్వో కార్యాలయంలోకి అభ్యర్థితో పాటు మరో నలుగురికి మాత్రమే ప్రవేశం ఉంటుంది. అభ్యర్థి తరఫున ఆర్వో కార్యాలయానికి మూడు వాహనాలను మాత్రమే అనుమతిస్తాం.

– డా.మల్లికార్జున, జిల్లా ఎన్నికల అధికారి

## నామినేషన్ దాఖలు చేయాలంటే..

- నామినేషన్ దాఖలు చేసే సమయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి చాంబర్‌లోకి ఐదుగురు వ్యక్తులను అనుమతిస్తారు.
- అభ్యర్థులు ఒరిజినల్ బి-ఫారం, ఎ-ఫారంను అందించాల్సి ఉంటుంది. వీటిని నామినేషన్ గడువు ముగిసే రోజు మధ్యాహ్నం మూడు గంటల్లోగా అందజేయవచ్చు.
- అభ్యర్థులు ఐదు ఫొటోలను నామినేషన్‌తో పాటు అందజేయాలి. అభ్యర్థి తన ఓటరు కార్డు, బలపరిచే వారి గుర్తింపు పత్రాలు ఇవ్వాలి. ఒక అభ్యర్థి గరిష్ఠంగా నాలుగు సెట్లు (జతల) నామినేషన్ పత్రాలను దాఖలు చేయవచ్చు.
- నామినేషన్ దాఖలు చేసే సమయంలో ఎన్నికల సంఘం నిర్దేశించిన ప్రతిజ్ఞ తప్పనిసరిగా చేయాలి.
- ప్రతిజ్ఞ చేసినట్లు ధ్రువీకరణ పత్రాన్ని తీసుకోవాలి.
- ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అభ్యర్థి తన సంతకం ఉండే విధానాన్ని విధిగా తెలియజేయాలి. అదే విధంగా బ్యాలెట్ యూనిట్‌లో తన పేరును ఎలా ముద్రించాలో వివరించి చెప్పాలి.
- అభ్యర్థి చెల్లించిన ధరావత్తుకు సంబంధించిన రసీదుతో పాటు ఎన్నికల ఖర్చును నమోదు చేసేందుకు నిర్దేశిత నమూనాలో ఉన్న రిజిస్టర్‌ను ఎన్నికల రిటర్నింగ్ అధికారి నుంచి తీసుకోవాలి.
- ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులపై ఏవైనా క్రిమినల్ కేసులు ఉంటే, వాటిని మూడు దినపత్రికల్లో ప్రకటన ద్వారా బహిర్గతం చేయాలి. ఆయా ఖర్చులు లెక్క చూపాలి.
- ఎన్నికల నామినేషన్ కేంద్రంలో సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తారు. అభ్యర్థులు తమ సందేహాలను ఇక్కడ నివృత్తి చేసుకోవచ్చు.

## అందుబాటులో అఫిడవిట్

- అభ్యర్థులకు సంబంధించిన అఫిడవిట్‌ని అందరికీ తెలిసేలా అందుబాటులో ఉంచుతారు. నకలును ప్రజలు కోరితే వాటిని ఉచితంగానే అందజేస్తారు. ఆన్‌లైన్‌లోనూ ఇవి అందుబాటులో ఉంటాయి.
- ప్రతి రోజూ మధ్యాహ్నం 3 గంటల వరకు వచ్చిన నామినేషన్లను.. ఆ తర్వాత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి ఎన్నికల కమిషన్‌కు తెలియజేస్తారు.
- నామినేషన్లను, అఫిడవిట్లను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నోటీసు బోర్డులో ప్రజల పరిశీలనకు ఉంచుతారు.
- నామినేషన్ దాఖలు పారదర్శకంగా ఉండేందుకు ఈ ప్రక్రియను సంపూర్ణంగా వీడియో తీయిస్తారు.

# మంచి ముహూర్తానికే..

- **నామినేషన్లకు సిద్ధమ**వుతున్న అభ్యర్థులు
- **రేపటి నుంచి 25 వ**రకు నామినేషన్ల **దాఖలుకు గడువు**
- **18 నుంచి 24 వరకు** సుముహూర్తాలు



**సాక్షి, విశాఖపట్నం :** నామినేషన్ల హడావుడి **గురువారం నుంచి ప్రారం**భమకానుంది. ఎన్నికల **కమిషన్ షెడ్యూల్ ప్రకారం** ఈనెల 18 నుంచి 25 **వరకు నామినేషన్ల సమర్ప**ణకు అవకాశం ఉంది. **దీనిని దృష్టిలో పెట్టుకు**ని ఆ మధ్య కాలంలో ఏరోజు ముహూర్తం బాగుందో తెలుసుకుని, ఆరోజు నామినేషన్లు వేయాలని చాలామంది అభ్యర్థులు ఆరాటపడుతున్నారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల బరిలో నిలిచే రాజకీయ నాయకులు మంచి ముహూర్తాల కోసం పండితులు, సిద్ధాంతులను ఆశ్రయిస్తున్నారు. ఆయా అభ్యర్థుల జాతక చక్రాలు, నామ/జన్మ నక్షత్రాలకు అనుగుణంగా వీరు ముహూర్తాలను నిర్ణయిస్తున్నారు. పంచాంగం ప్రకారం చూస్తే ఈనెల 18, 19, 22, 23, 24 తేదీల్లో మంచి ముహూర్తాలున్నాయి. ఇప్పటికే ఉమ్మడి విశాఖలో సార్వత్రిక ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు చాలావరకు ముహూర్తాలను నిర్ణయించుకున్నారు. అభ్యర్థుల జాతకంలో రవి గ్రహం, రవి, కుజ, శని గ్రహాలు బలంగా ఉంటే విజయావకాశాలు మెండుగా ఉంటాయని చెబుతారు. అందువల్ల అలాంటి ముహూర్తాలు ఏ సమయంలో ఉన్నాయో పరిశీలించి నిర్ణయం జరుగుతుందని విశాఖకు చెందిన స్మార్త పురోహితుడు చేబియ్యం రవిశర్మ 'సాక్షి'కి చెప్పారు. కొంతమంది అభ్యర్థులు మంచి ముహూర్తాలకు, మరికొందరు సెంటిమెంటుతో పాటు వారాలకు ప్రాధాన్యతనిస్తారని అందుకనుగుణంగా శుభగడియలను పడికట్టి ముహూర్తాలను నిర్ణయిస్తామని కేవీకే శాస్త్రి అనే మరో పురోహితుడు తెలిపారు.

## ఏ రోజు ఎవరు నామినేషన్?

| తేదీ | నియోజకవర్గం | అభ్యర్థి పేరు | పార్టీ |
|---|---|---|---|
| 18.4.24 | భీమిలి | గంటా శ్రీనివాసరావు | టీడీపీ |
| 18.4.24 | యలమంచిలి | ఎస్.విజయకుమార్ | జనసేన |
| 19.4.24 | విశాఖ పశ్చిమ | ఆడారి ఆనందకుమార్ | వైఎస్సార్‌సీపీ |
| 19.4.24 | విశాఖ ఉత్తర | కేకే రాజు | వైఎస్సార్‌సీపీ |
| 19.4.24 | విశాఖ తూర్పు | వి.రామకృష్ణబాబు | టీడీపీ |
| 19.4.24 | పాడేరు | విశ్వేశ్వరరాజు | వైఎస్సార్‌సీపీ |
| 19.4.24 | పాడేరు | రమేష్‌నాయుడు | టీడీపీ |
| 19.4.24 | నర్సీపట్నం | సీహెచ్ అయ్యన్నపాత్రుడు | టీడీపీ |
| 19.4.24 | యలమంచిలి | యూవీ రమణమూర్తిరాజు | వైఎస్సార్‌సీపీ |
| 19.4.24 | పెందుర్తి | అదీప్‌రాజ్ | వైఎస్సార్‌సీపీ |
| 22.4.24 | మాడుగుల | ఐ.అనూరాధ | వైఎస్సార్‌సీపీ |
| 22.4.24 | పాయకరావుపేట | కంబాల జోగులు | వైఎస్సార్‌సీపీ |
| 22.4.24 | అరకు | ఆర్.మత్స్యలింగం | వైఎస్సార్‌సీపీ |
| 22.4.24 | రంపచోడవరం | నాగులాపల్లి ధనలక్ష్మి | వైఎస్సార్‌సీపీ |
| 23.4.24 | నర్సీపట్నం | పెట్ల ఉమాశంకర్ గణేష్ | వైఎస్సార్‌సీపీ |
| 23.4.24 | విశాఖ ఉత్తర | విష్ణుకుమార్‌రాజు | బీజేపీ |
| 24.4.24 | విశాఖ తూర్పు | ఎంవీవీ సత్యనారాయణ | వైఎస్సార్‌సీపీ |
| 24.4.24 | భీమిలి | ముత్తంశెట్టి శ్రీనివాసరావు | వైఎస్సార్‌సీపీ |
| 24.4.24 | అనకాపల్లి | ఎం.భరత్ | వైఎస్సార్‌సీపీ |
| 24.4.24 | గాజువాక | గుడివాడ అమర్నాథ్ | వైఎస్సార్‌సీపీ |
| 24.4.24 | పెందుర్తి | పంచకర్ల రమేష్‌బాబు | జనసేన |
| 24.4.24 | చోడవరం | కరణం ధర్మశ్రీ | వైఎస్సార్‌సీపీ |
| 24.4.24 | అనకాపల్లి(ఎంపీ) | బూడి ముత్యాలనాయుడు | వైఎస్సార్‌సీపీ |

**మీకు తెలుసా**

## ఏ-ఫారం.. బీ-ఫారం అంటే?

**సాక్షి, విశాఖపట్నం :** ఎన్నికల సమయంలో తరుచుగా ఏ-ఫారం, బీ-ఫారం పేర్లు వింటుంటాం. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల గుర్తులు అభ్యర్థులకు రావాలంటే వీటి అవసరం ఉంటుంది. అవి ఏమిటో.. ఎలా ఇస్తారో తెలుసుకుందాం.

**ఏ-ఫారం అంటే..**

పార్టీ తన అభ్యర్థిగా ఎవరినైతే ఎంపిక చేస్తుందో వారికి బీ-ఫారం అందజేస్తారు. బీ-ఫారం అందించే వ్యక్తికి ముందుగా ఇచ్చేది 'ఏ' ఫారం. పార్టీ ఎవరిని ఎంపిక చేసి ఏ-ఫారం అందిస్తుందో వారికి మాత్రమే బీ-ఫారం అందిస్తారు. ఏ-ఫారం అందుకున్న పార్టీ అభ్యర్థి ఎన్నికల అధికారులకు అందజేస్తారు.

**బీ-ఫారం అంటే...**

గుర్తింపు పొందిన జాతీయ, ప్రాంతీయ పార్టీలు తమ పార్టీ నుంచి ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు వీరేనని గుర్తించేలా ఇచ్చేదే 'బీ' ఫారం. నామినేషన్ వేసే సమయంలో ఎన్నికల అధికారులకు ఈ ఫారాన్ని దాఖలు చేస్తేనే పార్టీకి సంబంధించి ఎన్నికల గుర్తును సదరు అభ్యర్థికి కేటాయిస్తారు. పార్టీ అధ్యక్షుడు, ప్రత్యేకంగా నియమితులైన ప్రతినిధుల ద్వారా బీ-ఫారాన్ని అందిస్తారు.

## యూపీఎస్సీ పరీక్షలకు ఏర్పాట్లు

**మహారాణిపేట:** జిల్లాలో ఈ నెల 21న జరగనున్న యూపీఎస్సీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని డీఆర్వో కె.మోహన్ కుమార్ వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్, లైజన్ అధికారులను ఆదేశించారు. పరీక్షల నిర్వహణపై కలెక్టరేట్ సమావేశ మందిరంలో తపాలా శాఖ పర్యవేక్షకుడు గజేంద్ర కుమార్‌తో కలిసి నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. 21న ఆదివారం నేషనల్ డిఫెన్స్ అకాడమీ (ఎన్‌డీఏ), కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ (సీడీఎస్) పరీక్షలను యూపీఎస్సీ నిర్వహిస్తోందన్నారు. జిల్లా వ్యాప్తంగా 6,347 మంది ఈ పరీక్షలకు హాజరు కానున్నారని, ఇందుకు 16 కేంద్రాలను సిద్ధం చేసినట్లు చెప్పారు. పరీక్షల నిర్వహణ కోసం ఆరుగురు రూట్ అధికారులను, 16 మంది లైజన్ అధికారులను నియమించినట్లు చెప్పారు. ఇప్పటికే పరీక్ష పత్రాలను స్ట్రాంగ్ రూముల్లో భద్రపరిచామన్నారు. అభ్యర్థులకు ఏ ఇబ్బంది కలగకుండా అన్ని విభాగాల సిబ్బంది సహకరించాలని కోరారు.

# పటిష్టంగా ఎన్నికల కోడ్ అమలు

- సీ-విజిల్‌కు 361 ఫిర్యాదులు
- రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో కలెక్టర్ మల్లికార్జున



మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున

**మహారాణిపేట:** జిల్లాలో ఎన్నికల కోడ్ అమలుకు పటిష్ట చర్యలు చేపడుతున్నామని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటున్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. కలెక్టరేట్ మీటింగ్ హాల్‌లో మంగళవారం జిల్లాలోని వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఎన్నికల కోడ్ అమలు, ప్రచారం, ఓటర్ల నమోదు, నామినేషన్ ప్రక్రియ తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు సమాధానమిస్తూ వారి సందేహాలను నివృత్తి చేశారు. ఎన్నికల కోడ్ అమలుకు జిల్లాలో చేపడుతున్న చర్యల గురించి వారికి వివరించారు.

**266 ఫిర్యాదుల పరిష్కారం**

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సీ-విజిల్ యాప్ ద్వారా ఇప్పటివరకు 362 ఫిర్యాదులు నమోదయ్యాయని, వాటిలో 266 ఫిర్యాదులను నిర్ణీత కాలంలో పరిష్కరించామని తెలిపారు. మిగిలిన 96 ఇతర అంశాలకు చెందినవన్నారు.

**ఎన్నికల ఉల్లంఘనలపై చర్యలు, ఎఫ్ఐఆర్‌లు**

ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనకు సంబంధించి పలువురిపై చర్యలు తీసుకున్నామని కలెక్టర్ చెప్పారు. 55 మంది వలంటీర్లు, ఏడుగురు ఒప్పంద ఉద్యోగులు, నలుగురు అవుట్ సోర్సింగ్, మరో ఇద్దరు రెగ్యులర్ ఉద్యోగులపై చర్యలు తీసుకున్నామన్నారు. వారిలో 28 మందిపై ఎఫ్ఐఆర్‌లు నమోదైనట్లు చెప్పారు. ప్రచారంలో భాగంగా నిబంధనలు అతిక్రమించిన ఘటనలపై 58 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయించామన్నారు. రాజకీయ పార్టీలపై ఇప్పటి వరకు 30 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయని చెప్పారు.

**రూ.5.02 కోట్ల నగదు సీజ్**

తనిఖీల్లో భాగంగా వస్తు, ధన రూపేణా ఇప్పటి వరకు రూ.5.02 కోట్ల నగదు సీజ్ చేశామని కలెక్టర్ వెల్లడించారు. సాధారణ పౌరుల వద్ద నుంచి సీజ్ చేసిన నగదుకు సంబంధించి కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన జిల్లా గ్రీవెన్స్ కమిటీ ద్వారా సంబంధిత ప్రతాలు సరిచూసి నగదును తిరిగి అందజేసినట్టు పేర్కొన్నారు.

**'సువిధ'కు 207 దరఖాస్తులు**

సువిధ యాప్ ద్వారా ఆన్‌లైన్ అనుమతుల కోసం మొత్తం 207 దరఖాస్తులు ఇప్పటి వరకు వచ్చాయని, అన్ని పరిశీలించి 129కి అనుమతులు ఇచ్చామని కలెక్టర్ చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న 65 దరఖాస్తులను తిరస్కరించామని, మరో 12 పురోగతిలో ఉన్నాయన్నారు.

**జిల్లా ఓటర్లు 20,00,290**

మంగళవారం నాటికి జిల్లాలో 20,00,290 మంది ఓటర్లు ఉన్నారని కలెక్టర్ తెలిపారు. తాజాగా 14,684 ఎపిక్ కార్డులు వచ్చాయని, వాటిని పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. నామినేషన్ల ప్రక్రియ, ఇతర అంశాల గురించి రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించారు. సమావేశంలో డీఆర్వో కె.మోహన్‌కుమార్, ఎన్నికల సెల్ అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## వైఎస్సార్ సీపీలోకి టీడీపీ సీనియర్ నాయకుడు

**మధురవాడ:** విశాఖ ఉత్తర నియోజకవర్గ పరిధి.. జీవీఎంసీ 42వ వార్డుకు చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు అబ్దుల్ షఫీ మంగళవారం వైఎస్సార్ సీపీలో చేరారు.

వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి ఆయనకు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. మధురవాడ ఐటీ సెజ్ జంక్షన్ వద్ద గల వైవీ సుబ్బారెడ్డి నివాసంలో వీకేపీసీపీఐఆర్ ఛైర్మన్, ఉత్తర నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు చొక్కాకుల వెంకటరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.



టీడీపీ నేత షఫీకి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎంపీ వైవీ సుబ్బారెడ్డి

# పెద్దలకే ప్యాకేజీ

- కింద స్థాయి నాయకులపై చిన్న చూపు
- రగిలిపోతున్న జనసేన, టీడీపీ శ్రేణులు
- ఎన్నికల ప్రచారానికి దూరం దూరం



**సాక్షి, విశాఖపట్నం:** పొత్తులో ఒకరికొకరు సీట్లను సర్దుబాటు చేసుకున్న కూటమి అభ్యర్థులు మిత్ర పక్ష పార్టీల పెద్దలకే ప్యాకేజీల్లో పెద్దపీట వేస్తున్నారు. తమపై చిన్న చూపు చూస్తున్నారన్న భావనలో చోటా మోటా నాయకులున్నారు. వాస్తవానికి టీడీపీ, జనసేన పార్టీల నేతలు ఉమ్మడి విశాఖ జిల్లాలో సగానికి పైగా స్థానాల్లో సీట్లను ఆశించి భంగపడ్డారు. ఆరంభంలో వీరు తమ అధినేతల తీరుపై తీవ్ర అసంతృప్తిని వెళ్లగక్కారు. పార్టీ కార్యక్రమాలకూ దూరంగా ఉన్నారు. మరికొందరు తిరుగు బావుటా ఎగురవేశారు. నోటిఫికేషన్‌తో పాటు ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో టికెట్లు దక్కించుకున్న కూటమి అభ్యర్థులు బుజ్జగింపుల పర్వానికి దిగారు. టికెట్లు ఆశించి భంగ పడ్డ వారితో పాటు పార్టీలో కీలక నాయకుల ఇళ్లకు వెళ్లారు. వారి స్థాయిని బట్టి విడతల వారీ ప్యాకేజీలకు ఒప్పించారు. ఇలా ప్యాకేజీ సెటిల్‌మెంట్లు రూ.లక్షలు, కోట్లలో జరిగిందన్న ప్రచారం జోరుగా సాగుతోంది. వీటికి తలొగ్గిన నేతలకు ఇప్పటికే ప్యాకేజీ సొమ్మును కొంతమేర పంపిణీ చేశారు. ఎలక్షన్ ప్యాకేజీతో అలక వీడిన నేతలు కూటమి అభ్యర్థుల తరపున ప్రచారానికి వెళ్తున్నారు. అయితే దిగువ స్థాయి నాయకులకు మాత్రం ఈ పరిణామం మింగుడు పడడం లేదు. వీరికి కూటమి అభ్యర్థులు ఇచ్చిన ప్యాకేజీ సొమ్ములో తమకు కూడా కొద్దోగొప్పో ఇవ్వకుండా వారే స్వాహా చేస్తున్నారంటూ రగిలిపోతున్నారు. కొన్ని చోట్ల తక్కువ ఖర్చుతో అయిపోయే విందు భోజనాలతోనే సరిపెడుతున్నారని ఆవేదన చెందుతున్నారు. ఇలా మన స్తాపంతో ఉమ్మడి విశాఖ జిల్లాలో కూటమి అభ్యర్థులు బరిలో ఉన్న చోట ప్యాకేజీ అందుకున్న పెద్ద నేతలే తప్ప కింది స్థాయి క్యాడర్ ప్రచారానికి దూరంగా ఉంటున్నారు.

**ఇదీ పరిస్థితి..**

భీమిలి టికెట్‌ను కూటమిలో టీడీపీ తరఫున గంటా శ్రీనివాసరావుకు కేటాయించారు. ఈ సీటును జనసేన నుంచి పంచకర్ల సందీప్, టీడీపీ నుంచి కోరాడ రాజబాబు ఆశించారు. ఆఖరి నిమిషంలో ఈ సీటును గంటా తన్నుకుపోవడంతో తొలుత వీరు అలకబూనారు. రాజబాబు అయితే గంటాపై తీవ్ర అవినీతి ఆరోపణలు కూడా చేశారు. పరిస్థితిని గ్రహించిన గంటా.. రాజబాబు ఇంటికి వెళ్లి బుజ్జగించారు. సందీప్‌కూ 'సర్ది' చెప్పారు. వీరిద్దరినీ భారీ ప్యాకేజీతో దారిలోకి తెచ్చుకోవడంతోనే గంటా వెంట ప్రచారంలో పాల్గొంటున్నారన్న ప్రచారం ఆ పార్టీ శ్రేణుల్లోనే జరుగుతోంది. అలాగే విశాఖ ఉత్తర టికెట్‌ను బీజేపీ అభ్యర్థి విష్ణుకుమార్‌రాజుకు కేటాయించారు. అక్కడ జనసేనలో కిందిస్థాయి శ్రేణులకు ప్యాకేజీ అందకపోవడంతో ప్రచారానికి దూరంగా ఉన్నారని తెలిసింది. పెందుర్తి జనసేన అభ్యర్థి పంచకర్ల రమేష్‌బాబు టీడీపీలో పైస్థాయి నేతలనే ప్రసన్నం చేసుకోవడంతో దిగువ క్యాడర్ ప్రచారంలో పాల్గొనడం లేదని చెబుతున్నారు. యలమంచిలి టీడీపీ సీటును ప్రగడ నాగేశ్వరరావు ఆశించారు. కానీ పొత్తులో జనసేన అభ్యర్థి సుందరపు విజయకుమార్‌కు ఇచ్చారు. తొలుత తన వర్గంతో ఆందోళనకు దిగిన ఆయనకు భారీ ప్యాకేజీ అందడంతో కొద్దిరోజుల నుంచి ప్రచారంలో పాల్గొంటున్నారని, ఆయన అనుచరులు మాత్రం దూరంగా ఉంటున్నారని అంటున్నారు. ఇక పాయకరావుపేట టీడీపీ అభ్యర్థి అనితను అక్కడ జనసేన నేతలు ఆది నుంచి వ్యతిరేకిస్తున్నారు. ఇటీవల అనకాపల్లి లోక్‌సభ కూటమి అభ్యర్థి సీఎం రమేష్ రంగంలోకి దిగి సర్దుబాటు చేసినా కింది స్థాయి క్యాడర్ టీడీపీ అభ్యర్థి ప్రచారంలో అంటీముట్టనట్టు వ్యవహరిస్తున్నారు. అరకు సీటును తొలుత టీడీపీలో దొన్నుదొరకు ప్రకటించారు. ఆ తర్వాత బీజేపీకి మార్చారు. దీనిపై టీడీపీలో నిరసనలు వ్యక్తమయ్యాయి. పెద్దలకు సర్దుబాటుతో ఇప్పుడు కొంతమంది ప్రచారంలో పాల్గొంటున్నారు.

## రేపు గురుకులాల్లో మిగుల సీట్లకు కౌన్సెలింగ్

**విశాఖ విద్య :** ఉమ్మడి విశాఖ జిల్లాలోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకులాల్లో 5వ తరగతిలో మిగుల సీట్ల భర్తీకి శ్రీకృష్ణాపురం గురుకులంలో ఈ నెల 18న కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రత్నవల్లి తెలిపారు. విశాఖ జిల్లాలోని శ్రీకృష్ణాపురం, అనకాపల్లి జిల్లాలోని సబ్బవరం, గొలుగొండ, దేవరాపల్లి గురుకుల పాఠశాలల్లో చేరేందుకు ఆసక్తి ఉన్న విద్యార్థులు కౌన్సెలింగ్‌కు హాజరుకావాలన్నారు. విద్యార్థులు తమకు సంబంధించిన అన్ని రకాల విద్యార్హత ధ్రువీకరణ పత్రాలు, తల్లి లేదా తండ్రి ఆధార్ కార్డు తీసుకుని రావాలన్నారు. కౌన్సెలింగ్ ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందని, మెరిట్‌తో పాటు రూల్ ఆఫ్ రిజర్వేషన్ అనుగుణంగా సీట్లు భర్తీ చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## మళ్లీ జగనే ముఖ్యమంత్రి కావాలి

**పద్మనాభం:** వైఎస్సార్ సీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మి.. భీమిలి ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావుతో కలిసి మంగళవారం మండలంలోని కృష్ణాపురం, పద్మనాభం, మద్ది గ్రామాల్లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ప్రజలు వారికి హారతులు పట్టి.. ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బొత్స ఝాన్సీ మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. ఐదేళ్లలో రాష్ట్రంలో ప్రతీ కుటుంబానికి మేలు జరిగిందన్నారు. ఎడ్లబళ్ల ర్యాలీ ప్రచారానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ

# టీడీపీ ప్రచారంలో విమ్స్ ఉద్యోగి

**ఆరిలోవ:** కూటమి అభ్యర్థి ఎన్నికల ప్రచారంలో విమ్స్ ఉద్యోగి పాల్గొని నిబంధనలు ఉల్లంఘించాడు. జీవీఎంసీ 13వ వార్డు పరిధి భగత్‌సింగ్‌నగర్‌లో మంగళవారం కూటమి అభ్యర్థి(టీడీపీ) వెలగపూడి రామకృష్ణబాబు తన అనుచరులతో ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఇదే వార్డుకు చెందిన పి.నూకరాజు ఎమ్మెల్యేతో కలసి వీధుల్లో ప్రచారం చేశాడు. ప్రస్తుతం నూకరాజు విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(విమ్స్)లో అవుట్ సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. ప్రభుత్వ సంస్థలో పని చేస్తూ టీడీపీ అభ్యర్థి తరఫున ప్రచారం నిర్వహించడం ఎన్నికల నియమ నిబంధనలు ఉల్లంఘించినట్లేనని.. అతనిపై చర్యలు తీసుకోవాలని మిగిలిన పార్టీల అభ్యర్థులు కోరుతున్నారు.


భగత్‌సింగ్‌నగర్‌లోఎమ్మెల్యే అభ్యర్థి వెలగపూడితో విమ్స్ ఉద్యోగి నూకరాజు(సర్కిల్)

# వంశీకృష్ణ వద్దే వద్దు

**జనసేన నాయకులు సాధిక్, మూగి శ్రీనివాసరావు**

**దాబాగార్డెన్స్:** విశాఖ దక్షిణ నియోజకవర్గ కూటమి అభ్యర్థి(జనసేన)గా వంశీకృష్ణ శ్రీనివాస్ వద్దే వద్దని జనసేన నాయకుడు, 39వ వార్డు కార్పొరేటర్ మహ్మద్ సాధిక్, ఆ పార్టీ మత్స్యకార వికాస విభాగం అధ్యక్షుడు మూగి శ్రీనివాసరావు అన్నారు. ఈ విషయమై పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్‌కు ఇప్పటికే బహిరంగ లేఖ పంపించామని చెప్పారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం సాధిక్ మాట్లాడుతూ దక్షిణ కూటమి అభ్యర్థిని మార్చాలని పవన్ కల్యాణ్‌ను కోరామన్నారు. వంశీకృష్ణ మోసం చేసి టికెట్ తెచ్చుకున్నారని.. ఎమ్మెల్సీ పదవికి రాజీనామా డ్రామా ఆడారని ఆరోపించారు. వంశీకృష్ణ ప్రచారంలో వెనుకబడి ఉన్నారని, ఓటమి ఖాయమని తేల్చి చెప్పారు. మూగి శ్రీనివాసరావు మాట్లాడుతూ దక్షిణ కూటమి అభ్యర్థిని మార్చాలన్న తమ వైఖరిని పార్టీ అధినేత దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. పార్టీలో ఉన్న వారిని కాదని, ఒక్క రోజూ కూడా పార్టీ జెండా మోయని వంశీకృష్ణకు టికెట్ ఇవ్వడం దురదృష్టకరమన్నారు. కార్పొరేటర్‌గా గెలిపించిన ప్రజలను వంశీకృష్ణ మోసం చేశారన్నారు. పక్క నియోజకవర్గం నుంచి ప్రజలను తెచ్చుకుని.. వంశీ ఇక్కడ ప్రచారం చేసుకుంటున్నారని ఎద్దేవా చేశారు. సమావేశంలో సూరాడ తాతారావు, అర్జిల్లి మసేన్, బుఖారి ఖాన్, బొడ్డు అప్పారావు, ఎండీ సలీం, ఎండీ భాషా, వెంకట్రావు, భాను, అబిదా, ఎండీ ఉస్మాన్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సాధిక్, మూగి శ్రీనివాసరావు

# అందర్నీ ఆకట్టుకునే 'మైడియర్ దొంగ'

**హీరోలు అభినవ్, నిఖిల్**

**దాబాగార్డెన్స్ :** అభినవ్ గోమటం, నిఖిల్ షాలిని, దివ్య శ్రీపాద నటించిన 'మైడియర్ దొంగ' చిత్ర బృందం మంగళవారం విశాఖలో సందడి చేసింది. నగరంలోని ఓ హోటల్లో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. ఈ నెల 19న చిత్రం విడుదల కానుందని చెప్పారు. మంచి కంటెంట్ ఉన్న సినిమా అని, ఇందులో తాను దొంగగా నటించానని హీరో అభినవ్ తెలిపారు. చాలా క్లారిటీ ఉన్న దొంగనని చెప్పారు. అత్యాస లేకుండా అవసరాల కోసం మాత్రమే దొంగతనాలు చేశానని, గతంలో మంచి దొంగ, అడవిదొంగ, జేబుదొంగ సినిమాలు వచ్చాయని గుర్తు చేశారు. హీరోయిన్ షాలిని మాట్లాడుతూ నిఖిల్ బాయ్‌ఫ్రెండ్ పాత్రలో, అభినవ్ దొంగ పాత్రలో కనిపిస్తారని, ఎవరైనా, ఎలాగైనా ఉండొచ్చు అన్నట్టు చూపించారన్నారు. అందరికీ ఈ చిత్రం బాగా కనెక్ట్ అవుతుందని చెప్పారు. దివ్య శ్రీపాద మాట్లాడుతూ వేసవిలో పన్నీటి జల్లు వంటి సినిమాగా పేర్కొన్నారు. మంచి సందేశం కూడా ఉంటుందని, యూత్‌ను బాగా ఆకట్టుకునే సినిమా అని, బాయ్ ఫ్రెండ్ మాత్రమే లోకం అన్నట్టుగా ఉండే అమ్మాయి పాత్రలో తాను కనిపిస్తానని తెలిపారు. హీరో నిఖిలేష్ మాట్లాడుతూ ఈ సినిమాలో తాను బాయ్‌ఫ్రెండ్ పాత్ర పోషించానని తెలిపారు.


చిత్ర వివరాలు వెల్లడిస్తున్న అభినవ్, నిఖిల్, దివ్య శ్రీపాద, షాలిని

## ఎన్నికల సిత్రాలు


**జగన్ బాబు ఆరోగ్యం జాగ్రత్త:** దువ్వాడలో జరిగిన ప్రచారంలో వైఎస్సార్ సీపీ గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్ 80 ఏళ్ల వృద్ధురాలిని కలిశారు. ఆ సమయంలో ఆమె సీఎం జగన్ ఆరోగ్య పరిస్థితులను అమర్‌నాథ్‌ను అడిగి.. జాగ్రత్తలు చెప్పింది. - అగనంపూడి


**తియ్య'టీ' అభిమానం:** సూపర్ బజార్ ఎదురుగా దుకాణంలో టీ తాగుతున్న వైఎస్సార్ సీపీ దక్షిణ ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్, దక్షిణ ఎన్నికల పరిశీలకుడు శ్రీవత్సవ్ - దాబాగార్డెన్స్


**జోరుమీదున్న బండి:** మద్దిలో ఎడ్లబళ్లపై ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ భీమిలి ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు - పద్మనాభం


**స్వీట్ మెమొరీ:** మహిళలతో సెల్ఫీదిగుతున్న వైఎస్సార్ సీపీ పెందుర్తి ఎమ్మెల్యే అభ్యర్థి అన్నంరెడ్డి అదీప్‌రాజ్ - పరవాడ


**శుభమస్తు:** 51వ వార్డులో వైఎస్సార్ సీపీ ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజును ఆశీర్వదిస్తున్న మహిళలు - మర్రిపాలెం


**విజయీభవ:** పెదజాలరిపేటలో వైఎస్సార్ సీపీ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీకి తిలకం దిద్దుతున్న మహిళ - ఎంవీపీ కాలనీ

# సైబర్ నేరం.. అప్రమత్తతే అస్త్రం

**సీపీ రవిశంకర్**

**అల్లిపురం:** సైబర్ నేరాల పట్ల నగర ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ హెచ్చరించారు. ఫెడ్ ఎక్స్, గేమ్ ఫ్రాడ్, లోన్ యాప్, ఆన్‌లైన్ ట్రేడింగ్ వంటి వ్యవహారాల్లో నగరంలో 2022 నుంచి 2024 వరకు 1,230 కేసులు నమోదైనట్లు తెలిపారు. సైబర్ నేరాల బాధితుల్లో ఒక్క విశాఖ నగరం నుంచి 12 వేల మంది ఉన్నారని వెల్లడించారు. ఈ నేరాల్లో సుమారు రూ.84 కోట్లను నగర వాసులు కోల్పోయారని, ఇందులో రూ.18 కోట్లు మాత్రమే బ్యాంకు ఖాతాల్లో ఫ్రీజ్ చేసినట్లు వివరించారు. నగర పోలీస్ కమిషనరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ వివరాలను సీపీ వెల్లడించారు. సైబర్ నేరాల నియంత్రణకు నగర పోలీసులు ప్రతిబింబ్ పోర్టల్‌ను రూపొందించినట్లు చెప్పారు. ఈ వెబ్‌సైట్ ద్వారా జాయింట్ పోలీస్ కమిషనర్ కె.ఫకీరప్పతో కలిసి స్పెషల్ డ్రైవ్ చేపట్టామన్నారు. సైబర్ నేరగాళ్లతో సంబంధం ఉన్న వివిధ ప్రాంతాల్లోని 126 మంది విశాఖ వాసుల డేటాను సేకరించామని, ఇందులో 36 మందిని గుర్తించి ఐదుగురిని అరెస్ట్ చేశామన్నారు. నగర ప్రజలను అప్రమత్తం చేసేందుకు సైబర్ క్రైం పోలీసులు రూపొందించిన రెండు పుస్తకాలను సీపీ ఆవిష్కరించారు.

- అక్రమ లావాదేవీలకు బ్యాంక్ ఖాతాలను అమ్ముకుని డబ్బులు సంపాదిస్తున్న 10 మందిని వివిధ కేసుల్లో సైబర్ క్రైం పోలీసులు అరెస్ట్ చేశారని సీపీ వివరించారు. మొందుగా సైబర్ నేరగాళ్లు వాట్సాప్, టెలిగ్రాం, వివిధ రకాల మాధ్యమాల్లో బ్యాంకు ఖాతా, ఇంటర్నెట్ బ్యాంకింగ్ వివరాలు తెలుసుకుని.. దానికి అనుసంధానమైన ఫోన్ నంబర్‌ను మార్చమని చెబుతారు. అలా చేయగానే ఆ ఖాతాను తమ ఆధీనంలోకి తీసుకుని.. తర్వాత ఆ ఖాతా ఇచ్చినందుకు డబ్బులు పంపిస్తారు. సైబర్ నేరగాళ్లు ఆ ఖాతాలను క్రిప్టో కరెన్సీ, బిట్ కాయిన్ ఎక్స్ఛేంజ్ తదితర అక్రమ లావాదేవీల కొరకు ఉపయోగిస్తారని సీపీ వెల్లడించారు.
- నగరానికి చెందిన ఓ బాధితుడికి గుర్తు తెలియని ఫోన్ నంబర్ నుంచి ఫోన్ కాల్ వచ్చింది. తాను ముంబయిలోని ఫెడెక్స్ కొరియర్ సర్వీస్ ప్రతినిధినని మాట కలిపాడు. ముంబయి నుంచి తైవాన్‌కు మీ పేరు మీద పార్సిల్ బుక్ అయిందని, అందులో నిషేధిత, చట్ట విరుద్ధ వస్తువులు, డ్రగ్స్ ఉన్నట్లు చెప్పి భయభ్రాంతులకు గురిచేశాడు. దీనిపై కేసు నమోదు చేశామని, ఈ కేసును నార్కోటిక్ పోలీసులకు బదిలీ చేస్తున్నామని చెప్పాడు. ఇంకో వ్యక్తి మాట్లాడుతూ విచారణ నిమిత్తం ముంబయి రావాల్సి ఉంటుందని చెప్పాడు. మా పై అధికారులకు ఫోన్ ఇస్తున్నామని చెప్పడం, అతను స్కైప్‌లో మాట్లాడిన తర్వాత మీ పై మనీలాండరింగ్, అక్రమ ఆయుధాల రవాణా, ఉగ్రవాదులకు మనీట్రాన్స్‌ఫర్ చేశారని కేసులు పెడుతున్నట్లు భయపెట్టాడు. దీంతో ఆ బాధితుడు భయపడిపోయి తన బ్యాంక్ ఖాతా నుంచి రూ.20 లక్షలు వారు చెప్పిన ఖాతాకు బదిలీ చేశాడు. ఈ విధంగా బాధితులను భయభ్రాంతులకు గురిచేసి లక్షలాది రూపాయలు ఆన్‌లైన్‌లో దోచుకుంటున్నారని సీపీ వెల్లడించారు. చైనా, కంబోడియా వంటి దేశాల నుంచి సైబర్ నేరాలకు పాల్పడుతున్నారని, ఇలాంటి కేసుల్లో అత్యవసరమైతే 1930కు ఫోన్ చేయాలని సీపీ సూచించారు. రాజస్థాన్ కేంద్రంగా బ్యాంక్ ఖాతాలను సరఫరా చేస్తున్న సైబర్ నేరగాళ్ల ముఠాలోని ఐదుగురు వ్యక్తులను అరెస్ట్ చేశామన్నారు.

**ఖాతాలను అమ్ముకోవద్దు**

విశాఖలో చాలా మంది యువత తమ బ్యాంక్ ఖాతాలను అమ్ముకుంటున్నారని సీపీ రవిశంకర్ తెలిపారు. కేవలం ఓ శాతం కమిషన్ కోసం యువత తమ ఖాతాలను అమ్ముకుని నేరగాళ్లుగా మారుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గుర్తు తెలియని వ్యక్తులకు, ఆన్‌లైన్‌లో పరిచయం అయిన వ్యక్తులకు బ్యాంక్ ఖాతా వివరాలను ఇవ్వొద్దని సూచించారు. అలా చేసి సైబర్ నేరానికి పాల్పడిన వారి మీద చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో సైబర్ క్రైం సీఐలు లక్ష్మణరావు, భవానీప్రసాద్ పాల్గొన్నారు.


సైబర్ క్రైం పోలీసులు రూపొందించిన పోస్టర్లు ఆవిష్కరించిన సీపీ రవిశంకర్

# కత్తులతో వీరంగం సృష్టించిన ఏడుగురి అరెస్ట్

**పోలీసుల అదుపులో రౌడీషీటర్ రూపేష్**

**సీతమ్మధార:** కత్తులతో వీరంగం సృష్టించి స్థానికులను భయభ్రాంతులకు గురిచేసిన ఓ రౌడీషీటర్‌తోపాటు పలువురిని ఫోర్త్ టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాలిలా.. సాలగ్రామపురం వేంకటేశ్వర స్వామి గుడి మెట్ల వద్ద సోమవారం అర్ధరాత్రి కొంత మంది గుమిగూడి కత్తులు పట్టుకొని గొడవ పడుతున్నారనే సమాచారంతో సీఐ ఎస్.విజయకుమార్, ఎస్ఐ వెంకటరావు, సిబ్బంది వెంటనే అక్కడికి వెళ్లారు. అక్కయ్యపాలేనికి చెందిన రౌడీషీటర్ పెద్దిశెట్టి రూపేష్, తన స్నేహితులు కర్రి నవీన్ అలియాస్ డాన్ శ్రీను, బత్తుల నారాయణరావు, శ్రీనివాసరావు కత్తులతో పెద్ద పెద్ద కేకలు వేస్తూ వీరంగం సృష్టిస్తున్నారు. వీరితో సింహగిరి కాలనీకి చెందిన కప్ప సాయిచైతన్యకుమార్‌కు ఘర్షణ జరిగింది. దీంతో పరస్పరం దాడులు చేసుకున్నారు. రూపేష్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా ఆటోలో అరకు, పాడేరు నుంచి గంజాయి తీసుకొచ్చి అధిక ధరలకు విక్రయిస్తుంటాడని తెలిసింది. రూపేష్‌తోపాటు ఆరుగురిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి కత్తులు స్వాధీనం చేసుకున్నారు. మరో ముగ్గురు పరారయ్యారు.

## సింహగిరిపై వేడుకలకు శారదా పీఠాధిపతికి ఆహ్వానం

**సింహాచలం:** సింహగిరిపై ఈ నెల 19న జరిగే శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి వార్షిక కల్యాణ మహోత్సవానికి, మే 10న చందనోత్సవానికి విచ్చేయాల్సిందిగా విశాఖ శ్రీ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతికి సింహాచలం దేవస్థానం ఆహ్వానం పలికింది. ఈ మేరకు సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి చినముషిడివాడలోని శారదాపీఠానికి వెళ్లి స్వామీజీకి ఆహ్వానపత్రిక అందజేశారు. కల్యాణోత్సవం, చందనోత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లు వివరించారు. ఈవో వెంట సింహాచలం దేవస్థానం ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఏఈవో వి.బి.వి.రమణమూర్తి ఉన్నారు.

# ప్రశాంత ఎన్నికలకు చర్యలు

**విశాఖ సిటీ:** జిల్లాలో పారదర్శకంగా ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ పోలీస్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం పోలీస్ సమావేశ మందిరంలో నియోజకవర్గాల వారీగా నియమించిన ఇన్‌చార్జి పోలీస్ ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఎన్నికల నిర్వహణకు చేస్తున్న ఏర్పాట్లను సమీక్షించారు. పోలీస్‌స్టేషన్ల వారీగా సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి అవసరమైన బందోబస్తు చర్యలు తీసుకోవాలని చెప్పారు. అన్ని పోలింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్స్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. బైండోవర్ చేసిన రౌడీషీటర్లపై నిఘా ఉంచాలని వివరించారు. ఇతర రాష్ట్రాల నుంచి ఎన్నికల విధులు నిర్వహించడానికి వచ్చిన పారా మిలటరీ బలగాలకు తగిన వసతి సదుపాయాలు కల్పించి ఎప్పటికప్పుడు ఏర్పాట్లను పర్యవేక్షించాలని సూచించారు. నామినేషన్ల ప్రక్రియ జరిగే సమయంలో తగిన బందోబస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో డీసీపీ(క్రైమ్) పి.వెంకటరత్నం, డీసీపీ లక్ష్మీనారాయణ, ఏడీసీపీలు, ఏసీపీలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సీపీ రవిశంకర్

# ఎన్నికల సన్నద్ధతపై సీఈసీ సమీక్ష

**కౌంటింగ్ కేంద్రాల ప్రతిపాదనలు పంపాలని ఆదేశం**

**మహారాణిపేట:** సార్వత్రిక ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా సూచించారు. ఎన్నికల సన్నద్ధతపై మంగళవారం ఆయన జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. వాహనాల తనిఖీలను విస్తృతం చేయాలని సూచించారు. కౌంటింగ్ సెంటర్లకు సంబంధించి ప్రతిపాదనలు పంపించాలన్నారు. కౌంటింగ్ పరిశీలకులు, అదనపు ఏఆర్వోల నియామకం తదితర అంశాలపై సీఈవో కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు. కలెక్టరేట్ వీసీ హాలు నుంచి కలెక్టర్ డాక్టర్ ఎ. మల్లికార్జున, ఎంసీసీ నోడల్ అధికారి సీఎం సాయికాంత్ వర్మ, జేసీ కె. మయూర్ అశోక్, ఏడీసీ కె.ఎస్. విశ్వనాథన్, జిల్లా రెవెన్యూ అధికారి కె. మోహన్ కుమార్ పాల్గొన్నారు.


వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్ మల్లికార్జున, జేసీ మయూర్ అశోక్, కమిషనర్ సాయికాంత్ వర్మ

# సెక్టార్ అధికారులు బాధ్యతగా పనిచేయాలి

- పోలింగ్ స్టేషన్లలో వసతులపై దృష్టి
- దివ్యాంగులు, వయోవృద్ధుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు
- జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్

**మహారాణిపేట:** ఎన్నికలను సజావుగా నిర్వహించడానికి సెక్టార్ అధికారులు అంకిత భావంతో చురుగ్గా పని చేయాలని జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్ సూచించారు. ఎన్నికల సన్నద్ధతపై మంగళవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సెక్టోరియల్ అధికారులతో జేసీ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 18న ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన నాటి నుంచి మరింత అప్రమత్తంగా పని చేయాల్సి కావున రానున్న నెల రోజులు చాలా కీలకమని అన్నారు. ఈ దిశగా సెక్టార్ అధికారులు మరింత ఉత్సాహంగా, బాధ్యతతో పనిచేయాలన్నారు. సెక్టార్ పరిధిలోని పోలింగ్ స్టేషన్ల వివరాలతో పాటు ఓటర్లకు చెందిన సమగ్ర సమాచారం పూర్తిగా తెలిసి ఉండాలని పేర్కొన్నారు. ఇందు కోసం కేటాయించిన వాహనాల్లో పోలింగ్ స్టేషన్లు సందర్శించి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. బీఎల్‌వోలు, రూట్ అధికారులు, సూపర్‌వైజర్లతో తరచూ సమీక్షలు చేయాలని ఆదేశించారు.

**సౌకర్యాలపై శ్రద్ధ**

పోలింగ్ బూత్‌లలో అవసరమైన ర్యాంపులు, విద్యుత్, తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాలను ముందుగా పరిశీలించుకొని, వాటిని సిద్ధం చేసుకోవాలని చెప్పారు. ఓటర్ల సంఖ్య ఆధారంగా పోలింగ్ ముందురోజు అవసరమైన టెంట్లు వేయించుకోవాలని తెలిపారు. అన్ని పోలింగ్ స్టేషన్లలో సీసీ కెమెరాలు ఉండేలా చూసుకోవడంతో పాటు అవసరమైన సాకెట్లను ముందుగా పరిశీలించుకోవాలని ఆదేశించారు. వయోవృద్ధులు, దివ్యాంగుల కోసం ప్రతి పోలింగ్ స్టేషన్ వద్ద వీల్ చైర్లు ఏర్పాటు చేస్తున్నామని, వారు నేరుగా వెళ్లి ఓటు వేసే వెసులు బాటు కల్పిస్తున్నట్టు తెలిపారు. ఓటరు స్లిప్పుల పంపిణీ పూర్తి స్థాయిలో జరిగేలా చర్యలు చేపట్టాలని జేసీ ఆదేశించారు. కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జేసీ మయూర్ అశోక్

# బస్సు యాత్రకు 'మేమంతా సిద్ధం'

- 20న చోడవరంలో సీఎం బహిరంగ సభ
- భారీ సంఖ్యలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రజలు తరలిరావాలి
- అనకాపల్లి ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు

**దేవరాపల్లి:** జిల్లాలో ఈ నెల 20న జరిగే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మేమంతా సిద్ధం బస్సు యాత్రను కనీవినీ ఎరుగని రీతిలో విజయవంతం చేయాలని డిప్యూటీ సీఎం, అనకాపల్లి ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. తారువలో వైఎస్సార్‌సీపీ మండల ముఖ్య నాయకులు, కార్యకర్తలతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో మాడుగుల ఎమ్మెల్యే అభ్యర్థి ఈర్లె అనురాధతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ నెల 20న జిల్లాలోకి ప్రవేశించే బస్సు యాత్రకు అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తరలివచ్చి ఆత్మీయ స్వాగతం పలకాలని సూచించారు. అదే రోజు చోడవరంలో మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో బ్రహ్మాండమైన బహిరంగ సభ జరుగుతుందన్నారు. ఈ సభకు ఒక్క దేవరాపల్లి మండలం నుంచే 10 వేల మందికి పైగా జనం హాజరయ్యే అవకాశం ఉందని అంచనా వేస్తున్నామన్నారు.

**అన్ని సర్వేల్లో వైఎస్సార్‌సీపీకే విజయం**

రానున్నది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమేనని పదికి పైగా సర్వేలతో పాటు కేంద్రం చేపట్టిన సర్వేలో సైతం స్పష్టమైందని ముత్యాలనాయుడు చెప్పారు. సీఎం జగన్ చేపట్టిన సంక్షేమం, అభివృద్ధి వైఎస్సార్‌సీపీకి గెలుపు సోపానాలుగా నిలుస్తాయన్నారు. చిన్న పాటి మనస్పర్థలను వీడి ఎన్నికల సమరంలో ప్రతీ కార్యకర్త సైనికుడిలా కష్టపడి పనిచేసి, సీఎం జగన్ చేసిన మేలును క్షేత్ర స్థాయిలో ప్రజలకు వివరించాలన్నారు. ధన బలంతో గెలవాలని పగటి కలలు కంటున్న కూటమి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల కుట్రలు వైఎస్సార్‌సీపీ జన బలం ముందు నిలవలేవన్నారు. స్థానికేతరులైన వీరి మాటలు ప్రజలు నమ్మడం లేదని, తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. జెడ్పీటీసీ కర్రి సత్యం, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూరె బాబురావు తదితర పార్టీ నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పీఏసీఎస్ అధ్యక్షులు, కార్పొరేషన్ల డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.


సమావేశానికి హాజరైన వైఎస్సార్‌సీపీ నాయకులు


మాట్లాడుతున్న అనకాపల్లి ఎంపీ అభ్యర్థి ముత్యాలనాయుడు